నేడు 'ఎస్కీ'లో హెల్త్ టాక్

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా క్యాంపస్‌లోని సెంటినరీ కన్వెన్షన్ సెంటర్ ఆడిటోరియంలో ప్రత్యేక హెల్త్ టాక్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 వరకు కొనసాగే కార్యక్రమంలో ప్రముఖ ఆరోగ్యనిపుణుడు, హోమియో వైద్యుడు, డాక్టర్ ఖాదర్‌వలీ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారన్నారు. ప్రస్తుతం మిల్లెట్స్ వినియోగం, ఆవశ్యకత, వాటి ఉపయోగాలు, సంపూర్ణ ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరిస్తారన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరల వివరాలు.. టమాట 30, పచ్చి మిర్చి 45, బెండ 60, కాకర 40, దొండ 40, దోస 50, ఆలు 40, చామ 50, కీర 30, బీర 50, వంకాయ 50, గోకర 50, బీన్స్ 70, బీట్ రూట్ 60, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 40, క్యారెట్ 80, చిక్కుడు 70, ఉల్లి 60, ములక్కాయలు (1)20 ,క్యాలీఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) 30, అల్లం 150, వెల్లుల్లి 400.

ఘనంగా లక్షపుష్పార్చన



చందానగర్: చందానగర్ డివిజన్ పరిధిలోని గంగారం జగద్రక్షక శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయ దశమ వార్షికోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం లక్షపుష్పార్చన నిర్వహించారు. ఉదయం 8 గంటలకు జరిగిన పంచామృతాభిషేకం, లక్షపుష్పార్చనలో అయ్యప్ప భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

గన్‌ఫౌండ్రీ: ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని టీపీసీసీ కార్యదర్శి మణిలాల్ షా పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్యాత్మిక భావాలు పెంపొందించేందుకు ప్రజల కోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఆదివారం మహాదేవ్ ఆలయంలో జరిగిన కార్తీక మాసం అంకుట్ పూజల్లో పాల్గొన్నా ఆయన ప్రసంగించారు. అన్ని పండుగలను ప్రభుత్వమే స్వయంగా చేస్తుందన్నారు.

వృత్తివిద్యా కోర్సులు.. యువతకు ఉపాధి అవకాశాలు!

వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వాలని విజ్ఞప్తి
నూతన కోర్సుల ఏర్పాటుతో మరిన్ని ఉద్యోగావకాశాలు
ఆ దిశగా చర్యలు చేపట్టాలని వేడుకోలు

రాయదుర్గం: ప్రస్తుతం ఉపాధి ఆధారిత కోర్సులకు డిమాండ్ పెరుగుతోంది. ముఖ్యంగా ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతం, హైదరాబాద్ నాలెడ్జి సిటీ పరిసరాల్లోని కాలనీలు, బస్తీలలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే కోర్సులను ఉన్నత విద్యాసంస్థలలో మరిన్నింటిని ఏర్పాటు చేస్తే ఉపాధి అవకాశాలు పెరుగుతాయనే అభిప్రాయం అందరిలోనూ ఉంది. పది, ఇంటర్మీడియేట్ కోర్సులతో ఉపాధి ఇచ్చే కోర్సులకు బాగా డిమాండ్ ఉంది. ఈ కోర్సులు పూర్తి చేసిన యువతకు ఉద్యోగాలు పొందేందుకు అవకాశాలు పెరుగుతున్నాయి. గతం నుంచి వస్తున్న అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్, పీహెచ్‌డీ కోర్సులు పూర్తి చేసిన వారికి అవకాశాలు వస్తున్నా అందరికీ రావడం లేదనే అభిప్రాయం నెలకొంది. ముఖ్యంగా బీఈడీ, ఇతర కోర్సులు పూర్తి చేసినా ఉద్యోగాలు దొరకడం నేటి పోటీ ప్రపంచంలో గగనంగా మారింది చాలా మంది వయోపరిమితి పూర్తయి ఇబ్బందులు పడ్డ సంఘటనలు కూడా లేకపోలేదని పలువురు యువత వ్యాఖ్యానిస్తున్నారు. పది పూర్తయిన తర్వాత రెండేళ్ల పాటు వృత్తి విద్యాకోర్సుల్లో చేరుతున్న యువతకు తమ కోర్సులు పూర్తయి సర్టిఫికెట్లు చేతికి అందగానే ఉద్యోగాల్లో చేరేందుకు అవకాశం నెలకొంటోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పరంగా వృత్తి విద్యాకోర్సులు నిర్వహించే విద్యా సంస్థలు ఎంతో అవసరమని ఈ విషయంపై ప్రభుత్వం దృష్టి సారించాలని అందరూ అభిప్రాయపడుతున్నారు.

జాబ్ గ్యారెంటీ కోర్సులతో..

వంద శాతం జాబ్ గ్యారెంటీ కోర్సులతో రాయదుర్గంలోని గవర్నమెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ(జీఐఎల్‌టీ). కొనసాగుతోంది. ఈ ఇనిస్టిట్యూట్‌లో మూడేళ్ల కాలపరిమితితో కూడిన లెదర్ గూడ్స్ అండ్ ఫుట్‌వేర్ టెక్నాలజీ, లెదర్ టెక్నాలజీ అనేక రెండు పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సులను నిర్వహిస్తున్నారు. మూడేళ్ల కాలపరిమితితో కూడిన ఒక్కో కోర్సులో 60 మంది చొప్పున రెండింటిలో కలిపి 120 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సులలో చేరడానికి కనీస విద్యార్హత పది పాసై పాలిసెట్‌లో కనబర్చిన ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు.



'మనూ' ప్రధాన భవనం

'మనూ'లోనూ మంచి అవకాశాలు..

మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని దూర విద్యా విధానంలో డిప్లొమో, సర్టిఫికెట్ కోర్సులను నిర్వహించడమే కాకుండా, ఐటీఐ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయడంతో ఎంతో మందికి విద్యా, ఉపాధి అవకాశాలు కలుగుతున్నాయి. వీటిలో మరిన్ని కోర్సులు ఏర్పాటు చేస్తే అందరికీ ఎంతో మేలు చేకూరే అవకాశం లేకపోలేదు.రెండు పీజీ డిప్లొమో, పది డిప్లొమో కోర్సులు, ఏడు సర్టిఫికెట్ కోర్సులు,అడ్వాన్స్ డిప్లొమో కోర్సు ఒకటి నిర్వహిస్తున్నారు. ఇదిలా వుండగా 'మనూ' లో ఐటీఐ కేంద్రం ఉండడంతో అందులో రెండేళ్ల కాలపరిమితితో కూడిన ఎలక్ట్రీషయన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, రిఫ్రిజిరేషన్ అండ్ ఏయిర్ కండిషనింగ్ టెక్నీషియన్ కోర్సులు ఉండగా ఏడాది కాలపరిమితితో కూడిన ప్లంబర్ కోర్సు కొనసాగుతోంది.

ప్రభుత్వ కళాశాలలో..

మధురానగర్‌లోని రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఐటీకారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్టుకు చేరువలో ఉండడంతో కంప్యూటర్‌సైన్స్ ఒకేషనల్ కోర్సును నిర్వహించడం విశేషం. ఈ కళాశాలలో అంకితభావంతో పనిచేసే ఇద్దరు లెక్చరర్లను ఏర్పాటు చేయడంతో ఈ కోర్సుకు ప్రాధాన్యం ఏర్పడింది. మొదట్లో 15 మంది ఉండగా నేడు ఏటా వందకుపైగా శిక్షణ పొందుతున్నారుఈ కోర్సులో చేరిన విద్యార్థులకు మంచి శిక్షణ ఇస్తుండడంతో ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉండేందుకు అవకాశం కలుగుతోంది.

'నిథమ్'లోనూ అనేక కోర్సులు..

గచ్చిబౌలిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌లో అనేక వృత్తి ఆధారిత కోర్సులను నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా ఫుడ్ తయారీ, ఆతిథ్య రంగాలకు చెందిన పలురకాల శిక్షణా కార్యక్రమాలను నిర్వహించి స్వయం ఉపాధి పొందేలా యువత, మహిళలను ప్రోత్సహిస్తున్నారు. ఫుడ్, పర్యాటక, ఆతిథ్య రంగాల లో డిప్లొమో కోర్సులను కొనసాగిస్తున్నారు.

యువత, స్థానికుల డిమాండ్లు ఇవే..

- ఐటీకారిడార్, ఫైనాన్షియల్‌డిస్ట్రిక్ట్, హైదరాబాద్ నాలెడ్జి సిటీ ప్రాంతానికి చేరువలోనే ఉండే కాలనీలు, బస్తీలలోని యువతకు ఉపాధి కల్పించేందుకు అవసరమైన కంప్యూటర్ సెంటర్లు, ఇతర డిప్లొమో కోర్సులు ఏర్పాటు చేయాలి.
- రాయదుర్గంలోని జీఐఎల్‌టీలో స్వల్పకాలిక కోర్సులను మరిన్నింటిని ఏర్పాటు చేసేందుకు చేస్తున్న చర్యలు వేగవంతం చేసి యువతకు అందుబాటులోకి తేవాలి
- నిథమ్, ఇంజినీరింగ్‌స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కూడా మరిన్ని డిప్లొమో, స్వల్పకాలిక కోర్సులను నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలి.
- ఉన్నత విద్యాసంస్థల్లో మరిన్ని వృత్తి ఆధారిత కోర్సులను ఏర్పాటు చేయడంతో పాటు పలు రకాల స్వయం ఉపాధి పొందేందుకు అవసరమైన శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తే మరింత మందికి ఉపాధి కల్పించి సొంతకాళ్లపై నిలబడేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో పాటు ఉన్నత విద్యా సంస్థలకు అవకాశం కల్పించాలి.



హెచ్‌సీయూలోనూ..

50 ఏళ్ల చరిత్ర గల హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోనూ పలు వృత్తివిద్యాకోర్సులను నిర్వహిస్తున్నారు. హెచ్‌సీయూలో సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ వర్చువల్ లెర్నింగ్ ఆధ్వర్యంలో ఈ కోర్సులను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం యూజీసీ, ఏఐసీటీఈ,డీఈసీ జాయింట్ కమిటీ ఆమోదం పొందిన 14 వివిధ రకాల డిప్లొమో కోర్సులను ప్రతియేటా దూరవిద్యా వ్యవస్థ ద్వారా నిర్వహిస్తున్నారు ఇతర సంస్థలతో సంయుక్తంగా ఆరుమాసాల అప్‌స్కిల్లింగ్ కోర్సులను కూడా ఏర్పాటు చేశారు.



నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: విద్యుత్ మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గచ్చిబౌలి ఏఈ భాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు.. పీజేఆర్‌నగర్, టెలికాంనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

చందానగర్: తారానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సుమన్ తెలిపారు.

ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు..

చందానగర్ ఫీడర్ పరిధిలో: చందానగర్ మెయిన్ రోడ్డు, పూర్ణిమా అపార్ట్‌మెంట్, వేంకటేశ్వర స్వామి టెంపుల్ ప్రాంతాలు.

తారానగర్ ఫీడర్ పరిధిలో: వెంకట్‌రెడ్డి కాలనీ, పోచమ్మ టెంపుల్ వెనకాల వైపు, వెంకటాద్రినగర్, పీజేఆర్ స్టేడియం ప్రాంతాలు.

హుడాకాలనీ ఫీడర్ పరిధిలో: హుడా కాలనీ, జాకబ్ బేకరీ, వాటర్ ట్యాంక్, పార్క్ వెనకాల, ఎంఎంటీఎస్ స్టేషన్ రోడ్డు, ఆర్‌ఎస్ బ్రదర్స్ మెయిన్ రోడ్డు ప్రాంతాలు. ఇంజినీర్స్ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో: గంగారం, మంజీరా పైప్‌లైన్ రోడ్డు, గంగారం మెయిన్ రోడ్డు, ఇంజినీర్స్ ఎన్‌క్లేవ్ ప్రాంతాలు.

రామాలయం ఫీడర్ పరిధిలో: హుడా ట్రేడ్ సెంటర్, ఓల్డ్ లింగంపల్లి, సాయిబాబా టెంపుల్ వెనక ప్రాంతాలు.

లింగంపల్లి ఫీడర్ పరిధిలో: సాయిమారుతి ఎన్‌క్లేవ్, తారానగర్ హోల్‌సేల్ మార్కెట్, తారానగర్ మెయిన్ రోడ్డు, కానుకుంట, పోలీస్ క్వార్టర్స్, వెజిటేబుల్ మార్కెట్, వీరేశం గౌడ్ హౌజ్, మటన్ మార్కెట్ ప్రాంతాలు.

రైల్ విహార్ ఫీడర్ పరిధిలో: శివాజీనగర్, సిటిజన్ కాలనీ, గిడ్డంగి, ఓల్డ్ లింగంపల్లి ప్రాంతాలు.

మైత్రీనగర్ ఫీడర్ పరిధిలో: సాయిబాబా టెంపుల్ దగ్గర, ఎంఎంటీఎస్ ట్రాక్ రోడ్డు ప్రాంతాలు.

శాంతినగర్ ఫీడర్ పరిధిలో: సబ్‌స్టేషన్ దగ్గర, శాంతినగర్, రఘుపతిరెడ్డి హౌజ్ దగ్గర, కడిమి హాస్పిటల్, హుడా కేఫ్ మెయిన్ రోడ్డు దగ్గర తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలన్నారు.

ఆత్మీయులను కలిపే వేదిక వనభోజనాలు



కేంద్ర మంత్రి సంజయ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న నిర్వాహకులు

పటాన్‌చెరు టౌన్: కార్తీకమాసంలో ఆత్మీయులు అందరినీ కలిపే వేదిక వనభోజనాలని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఆదివారం మైత్రీ మైదానంలో శ్రీకృష్ణదేవరాయ కార్తీక వనభోజనాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వనభోజనాల నిర్వాహకులు కేంద్ర సహాయక మంత్రిని సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, మున్నూరు కాపు సంఘం పెద్దలు భిక్షపతి పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం



వివాహానికి ఆర్థిక సాయం అందించిన మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు

మణికొండ: పేదలకు తమ వంతు ఆర్థిక సాయం అందించి వారికి అండగా ఉంటామని నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లి మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ స్వరూప నగేష్‌యాదవ్‌లు అన్నారు. ఆదివారం వట్టినాగులపల్లి గ్రామానికి చెందిన అల్లం మల్లేష్ కూతురు వివాహానికి రూ. 71 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజాప్రతినిధులుగా ఉన్నా లేక పోయినా పేదలకు అండగా ఉంటామన్నారు. పేదల వివాహాలు, చదువులకు తమ వంతు సాయం నిరంతరంగా అందిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు.

సందడిగా కార్తీక వనభోజనాలు

మణికొండ: కార్తీక మాసం సదర్భంగా వివేక భారతి యోగా శాఖ ఆధ్వర్యంలో మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ అనంత పద్మనాభస్వామి ఆలయం ఆవరణలో ఆదివారం వనభోజనాలను సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపూజ నిర్వహించి కార్తీక మాసం ప్రాముఖ్యతను వివరించారు. హనుమాన్ చాలీసా పారాయణం అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం భజనలు, కీర్తనలు, సాంస్కృతిక క్విజ్, శ్లోక పఠనం నిర్వహించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



మాదాపూర్: కూచిపూడి, ఒడిస్సీ నృత్యాలతో కళాకారులు సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదివారం శిల్పారామం, శ్రీ అఖిలభారత కూచిపూడి నాట్యకళా మండలి సంయుక్త నిర్వహణలో శ్రీ భరతముని జయంతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పద్మభూషణ్ వెంపటి చినసత్యం 95వ జయంతి ఉత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వెంపటి చినసత్యం శిష్యబృందం , చావలి బాలత్రిపుర సుందరి శిష్య బృందంచే మామమతుశ్రీ సరస్వతి, తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. దేబశ్రీ పట్నాయక్ శిష్యబృందం ఒడిస్సీ నృత్యంతో అలరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పసుమర్తి వెంకటేశ్వరశర్మ, డాక్టర్ వేదాంతం వెంకటనాగ చలపతి పాల్గొని కళాకారులను సత్కరించారు.

ట్రాఫిక్ జామ్



జీహెచ్ఎంసీ కార్యాలయం సమీపంలో స్తంభించిన వాహనాలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలోని పాత ముంబాయి జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ అయింది. ఆదివారం మధ్యాహ్నం శేరిలింగంపల్లి జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయం సమీపంలో యూటర్న్ వద్ద జీహెచ్ఎంసీ స్వీపింగ్ వాహనం నిలిచిపోవడంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు ఒక్కసారిగా స్తంభించిపోయాయి. సెలవు దినం వాహనాల రద్దీ తక్కువగా ఉండటంతో వల్ల త్వరగానే క్లియర్ అయింది. అనంతరం జీహెచ్ఎంసీ స్వీపింగ్ వాహనాన్ని రోడ్డు మీద నుంచి పక్కకు నెట్టడంతో రాకపోకలకు సాఫీగా సాగాయి.

బీఎంఎస్‌తోనే సమస్యల పరిష్కారం

- రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రదీప్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రదీప్‌కుమార్

పటాన్‌చెరు: బీఎంఎస్‌తోనే కార్మికుల సమస్యల పరిష్కారం సాధ్యమని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రదీప్‌కుమార్ అన్నారు. ఆదివారం పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలోని హిమజాల్ బేవరేజ్ పరిశ్రమ కార్మికులు సీఐటీయూ యూనియన్ నుంచి బీఎంఎస్ యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ.. పరిశ్రమలో కార్మికుల వేతన ఒప్పందం 18 నెలలైనా పూర్తి కాలేదన్నారు. కార్మికులు ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని, ప్రశ్నిస్తే బెదిరింపులు, దౌర్జన్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ యూనియన్ నాయకులకు కార్మికుల సమస్యలు పట్టవని కేవలం సభలు, సమావేశాల, సోషల్ మీడియాతోనే కాలం గడుపుతారని విమర్శించారు. హిమజాల్ బేవరేజ్ పరిశ్రమ కార్మికుల సమస్యలన్నీ పరిష్కరించి, ఘనమైన వేతన ఒప్పందం చేస్తామని కార్మికులకు హామీ ఇచ్చారు. యాజమాన్యం కార్మికులను వేధించడం, తొలగించడం చేస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి మహేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సంజయ్‌కుమార్, మురారి, నర్సింలు, శ్రావణ్‌కుమార్, రవి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వసంతరావుకు నివాళి



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేత నీలం మధు

పటాన్‌చెరు: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నాందేడ్ ఎంపీ వసంత్‌రావు చావన్ చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కర్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ స్థానిక నాయకులతో కలిసి వసంతరావు చావన్ నివాసంలో వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వసంతరావు చవాన్ వారసుడు రవీంద్ర చవాన్, నాయగావ్ అసెంబ్లీ అభ్యర్థి మీనల్ పాటిల్ కొనసాగించాలని సీఎం సూచించారు.

కరాటేలో రాణించిన అన్విక

మణికొండ: మహారాష్ట్రలోని పూణే కేంద్రంగా జరిగిన జాతీయ కరాటే చాంపియన్ షిప్ పోటీలలో నార్సింగి మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన జల్లి అన్విక రాణించింది. ఆరు సంవత్సరాల విభాగం పోటీలలో పాల్గొన్న ఆమె స్వర్ణ పతకం సాధించింది. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో మొదటి స్థానంలో నిలిచి జాతీయ పోటీలకు ఎంపికైంది. ఆదివారం పూణేలో జరిగిన జాతీయ స్థాయి పోటీలో ఆమె మరో మారు తన సత్తా చాటి బంగారు పథకాన్ని సాధించిందని ఆమె తండ్రి జల్లి రాజీవ్‌గాంధీ ముదిరాజ్ తెలిపారు.



మొదటి స్థానంలో నిలిచిన అన్విక

రెడ్‌బుల్ బేస్‌మెంట్ ఇన్నోవేషన్

చాంపియన్‌షిప్ ఫినాలే విజయవంతం

రాయదుర్గం: దేశంలోని అత్యంత ఉత్తేజకరమైన యువ మేధావులకు ఏకతాటిపైకి తీసుకొచ్చింది రెడ్‌బుల్ బేస్‌మెంట్ ఇండియా ఫినాలే కార్యక్రమం. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని 'టీహబ్' ప్రాంగణంలో ఆదివారం రాత్రి వరకు సాగిన కార్యక్రమంలో రెండు గ్రూపులను విజేతలుగా ప్రకటించారు. నిపుణులైన న్యాయనిర్ణేతలు విజేతలను ఎంపిక చేశారు. అద్భుతమైన ఆలోచన ఉన్న రెండు జట్లను విన్నర్-1, విన్నర్-2గా ఎంపిక చేశారు. అందులో విజేత-1గా జయ్యాన్‌దలాల్, తేజస్‌తరుణ్‌తో కూడిన గ్రూపు నిలిచింది. వారి ఐడియా-గైడెడ్ ఏరియల్ ట్రాక్ ఇన్‌స్పెక్షన్(జీఏటీఐ), రెండవ విజేత-2గా కొల్లిపరనాగ సమన్విత, రుద్రరాజుహేమంత్ వెంకటసాయివర్మ వారి ఐడియా-స్కిల్‌షేర్ పేరిట రూపొందించిన అద్భుతమైన ఆలోచనకు విజేతలుగా నిలిచారు. అద్భుత మైన ఈ ఆలోచనలు ఉన్న రెండ్లు జట్లు 2024 వరల్డ్ ఫైనల్ కోసం జపాన్‌లోని టోక్యో వెళ్లాల్సి ఉంటుంది. డిసెంబర్ 2 నుంచి 6వ తేదీ వరకు వరల్డ్ ఫైనల్స్‌ను నిర్వహిస్తారు.



చాంపియన్‌షిప్ విజేత-1గా నిలిచిన జట్టు



విజేత-2గా నిలిచిన జట్టు

మున్సిపల్ ఆఫీస్.. బస్టాప్ ప్లీజ్..!

- సింప్లెక్స్ వద్ద లేని బస్టాప్
- మున్సిపల్ కార్యాలయానికి రవాణా వసతులు పూజ్యం
- ప్రజలకు తప్పని ఇబ్బందులు

శంషాబాద్: పరిపాలన సౌలభ్యం కోసం ప్రారంభించిన కొత్త మున్సిపల్ కార్యాలయానికి రవాణా సౌకర్యం అగమ్య గోచరంగా తయారైంది. పట్టణంలో సింప్లెక్స్ రహదారి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మున్సిపల్ కార్యాలయానికి రాకపోకలు సాగించేందుకు సాధారణ ప్రజలతో పాటు సిబ్బంది సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.



జాతీయ రహదారి పక్కన సింప్లెక్స్ రహదారి ప్రాంతం

దూరం.. దూరం...

- పురపాలక సంఘ కార్యాలయాన్ని పట్టణానికి దూరంగా సింప్లెక్స్ సమీపంలో జాతీయ రహదారికి రెండు కిలోమీటర్ల దూరంలో నిర్మించారు. అట్టహాసంగా ఆ ప్రారంభించారు. నెలరోజులుగా ఇక్కడి నుంచే పూర్తి స్థాయి కార్యకలాపాలు జరుగుతున్నాయి. కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఆటోలను మాత్రమే ఆశ్రయించాల్సి వస్తోంది.
- అటుగా షేర్ ఆటోలు కూడా రాకపోకలు లేకపోవడంతో రూ. 150 నుంచి రూ. 250 వరకు చెల్లించాల్సి వస్తోంది. తిరిగి వెళ్లే సమయంలో కూడా ఆటోలు సైతం దొరక్క నానా ఇబ్బందులు పడుతున్నారు.

సింప్లెక్ వద్ద బస్టాప్ ఏర్పాటుకు వినతి...

- శంషాబాద్ నుంచి నగరం వైపు ప్రయాణించే బస్సులను సింప్లెక్స్ వద్ద బస్టాప్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే ఉద్యోగులతోపాటు ప్రజలకు కొంత మేరకు సౌలభ్యంగా మారుతుందని పేర్కొంటున్నారు.



సింప్లెక్స్ రహదారిలో కొత్త మున్సిపల్ కార్యాలయం

- సంబంధిత ఉన్నతాధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి మున్సిపల్ కార్యాలయానికి రవాణా సౌకర్యాన్ని కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.